క్లుప్తంగా

సామాజిక న్యాయంపై చర్చావేదిక

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన్ భాగిదారి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయం) అనే అంశంపై విద్యార్థుల మధ్య ప్రత్యేక చర్చావేదిక కార్యక్రమాన్ని పాలకొండ, వీరఘట్టం ఎంఈఓలు కె.సోంబాబు, ఆర్.ఆనందరావు నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశిష్టతపై చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలను చేపట్టారు. పాలకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.ఆదిత్య ప్రథమ స్థానం, జెడ్పీహెచ్ఎస్ వీరఘట్టానికి చెందిన జి.దుర్గాప్రసాద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. తలవరానికి చెందిన పి.కిషోర్ తృతీయ స్థానం దక్కించుకున్నారు. క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో సీతంపేట, భామిని మండలాలకు చెందిన జె.తేజశ్రీ, ఎ.భవ్యశ్రీ, కార్తికేయ, టి.నిహారిక, సంజన కుమారి నిలిచారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు భౌరోతు శంకరరావు, కె.జనార్ధనరావు, ఎం.కుసుమకుమారి, ఎం.శివకుమార్, ఎ.బాబురావులు వ్యవహరించారు.

దేవాలయ అభివృద్ధికి బూరి విరాళం


ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందజేస్తున్న ఓలేటి లక్ష్మి

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి జియ్యమ్మవలస మండలం బట్లబద్ర గ్రామానికి చెందిన దివంగత ఓలేటి జగన్నాథం భార్య లక్ష్మి రూ.లక్ష బూరి విరాళం తోటపల్లి టెంపుల్స్ డవలప్‌మెంట్ సేవా ట్రస్టుకు బుధవారం అందించారు. వయో వృద్ధురాలు ఆలయ అభివృద్ధికి భారీగా విరాళం ఇవ్వడం ఎంతో అభినందించదగ్గ విషయమని ట్రస్టు సభ్యులు డి.పారినాయుడు అన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిస్తున్న సర్వేశ్వరరావు

పాలకొండ: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆవరణలో విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ డొంక శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై విస్తృత ప్రచారం

సీతానగరం: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయడం వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశమని అరకు పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ సమన్వయకర్త డాక్టర్ హేమానాయక్ అన్నారు. సీతానగరం మండలంలోని ఎస్. సీతారాంపురం, దయానిధిపురం గ్రామాల్లో బుధవారం జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రజలకోసం వైద్య శిబిరాలు నిర్వహించడం తోపాటు ఉచితవంటగ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే గ్రామాల్లో ప్రజా సమస్యలను ప్రభుత్వానికి నివేదించడానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెలుగు రేఖలు

నాడు...


నాటి సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల (ఇన్‌సెట్లో) నాటి విద్యార్థులు

నేడు...


నేటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల (ఇన్‌సెట్లో) నేడు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

మండలం:	సీతంపేట
పాఠశాల పేరు:	గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల
విద్యార్థుల సంఖ్య:	640

మౌలిక వసతులకు నాడు – నేడులో

మంజూరైన నిధులు:	రూ.61.04 లక్షలు
ఖర్చు చేసినవి:	రూ.25.16 లక్షలు

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అందరూ గిరిజన విద్యార్థినులే చదువుతున్నారు. వీరికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు, యూనిఫారాలు, కాస్మోటిక్స్ వంటివి ప్రభుత్వం అందజేస్తుంది. టీడీపీ హయంలో మౌలిక వసతులు ఏమీ లేవు. ప్రతీ ఏటా కేవలం గదులకు రంగులు వేసి సరిపెట్టేవారు. విద్యార్థినులకు చాలినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు గతంలో లేవు. దీంతో విద్యార్థులు చదువులు నామమాత్రంగానే ఉండేవి. అప్పట్లో 420 మంది మాత్రమే చదివేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించింది. కార్పొరేట్ తరహాలో డిజిటల్ క్లాసురూంలు, సరిపడినన్ని వాష్‌రూంలు నిర్మించారు. పౌష్టికాహారంతో కూడిన భోజనం పెడుతున్నారు. విద్యార్థినులకు అవసరమైన యూనిఫారాలు, పుస్తకాలు వంటివి సరఫరా చేస్తున్నారు. ఇక్కడ సీటు రావడమంటే చాలా కష్టసాధ్యమైన పనిగా ఇప్పుడు మారింది. ప్రస్తుతం 640 మంది విద్యార్థినులు 3 నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. విద్యార్థినులంతా జగన్ మామకు రుణపడి ఉంటామని చెబుతున్నారు.

జగన్‌మామకు రుణపడి ఉంటాం

పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు జగన్‌మామ కల్పించారు. కార్పొరేట్ తరహాలో ఇంగ్లిష్ మీడియంలో బోధన సాగుతుంది. గతంలో కంటే ఇప్పుడు మెరుగైన విద్య అందుతోంది. ముఖ్యమంత్రి జగన్ మామయ్యకు రుణ పడి ఉంటాం. – సవర సురేఖ, బాలికల ఆశ్రమ పాఠశాల, సీతంపేట

వారపు సంతకు పండగ కల


గుమ్మలక్ష్మీపురం వారపు సంతకు తరలివచ్చిన ప్రజలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో బుధవారం జరిగిన వారపు సంతలో పండగ కల సంతరించుకొంది. మరో మూడు రోజుల్లో సంక్రాంతి పెద్ద పండగ రానుండటంతో కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు ఈ సంతకు తరలివచ్చారు. వేసిన పంటలు చేతికి అంది రావటంతో ఇంటిల్లిపాదికి అవసరమైన నిత్యావసర సరుకులతో పాటు, పిండి వంటలు నిర్వహించేందుకు బెల్లం, నూనె, పంచదార వంటి వాటితో పాటు, కొత్త దుస్తులు, సిల్వర్, మట్టి పాత్రలు, గాజులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితరవి కొనుగోలు చేసుకునేందుకు పెద్ద ఎత్తున కొనుగోలుదారులు తరలివచ్చారు. ప్రతీ ఏటా వచ్చే సంక్రాంతి పండగప్పుడే వ్యాపారాలు బాగా సాగుతాయని పలువురు వ్యాపారులు సంబరపడుతున్నారు. వారపు సంత ప్రదేశంతో పాటు గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో ఉన్న కిరాణా షాపులు, పండ్ల దుకాణాలు, రడీమేడ్ దుకాణాలలో కూడా ఆయా వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. దీంతో మండల కేంద్రమంతా వచ్చీపోయే జనాలతో రద్దీ ఏర్పడింది.

పలుచోట్ల సామాజిక సమతా సంకల్పం


పాలకొండ రూరల్: గోపాలపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు

పాలకొండ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్ అన్నారు. ఈ నెల 19న విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ సందర్భంగా మండలంలోని గోపాలపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వారాడ దుర్గారావు, వి.చంద్రశేఖర్, సవిరిగాన చిన్నికృష్ణ, మాచర్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడలో..


కొమరాడ: విక్రంపురం సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు

కొమరాడ: భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ నాయకుడు కళింగి మల్లేశ్వరరావు అన్నారు. విక్రంపురం, సచివాలయం పరిధిలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా విక్రంపురం సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద బుధవారం నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి బీమయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నిత్యావసరాలు

- వైఎస్సార్ చేయూత మార్కెట్‌లో రెండు రోజుల్లో రూ.20లక్షల వ్యాపారం
- సంక్రాంతి కానుకగా రూ.1000లకు 12 రకాల సరుకులు


వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లో సిద్ధంగా ఉన్న బ్రాండెడ్ సరుకులు

వీరఘట్టం: ఇటీవల వీరఘట్టం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లో మార్కెట్ కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు విక్రయిస్తుండడంతో ఈ సరుకులు కొనుగోలు చేసేందుకు మహిళలు ఎగబడుతున్నారు. వాస్తవానికి ఈ మార్ట్ ఇంకా ప్రారంభించలేదు. మండలంలోని 1500 గ్రూపులు ఉండగా చాలా మంది మహిళల నుంచి సరుకులు కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరి వద్ద రూ.1000 చొప్పున ముందస్తుగా వసూళ్లు చేశారు. సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో కిలో చొప్పున పంచదార, గోధుమ నూక, కందిపప్పు, గోధుమ పిండి, వేరుశనగ పలుకులు, ఇడ్లీ రవ్వ, బాంబినో సేమియా, శనగ పప్పు, బెల్లంతో పాటు రెండు లీటర్ల ఆధార్ ఆయిల్, విమ్ బార్, తదితర 12 రకాల సరుకులను కేవలం రూ.1000 లకు ఇస్తుండడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కంటే నాణ్యమైన సరుకులను తక్కువ ధరకు ఇవ్వడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగా 2 వేల మంది నుంచి రూ.1000 చొప్పున కలక్షన్ చేయడంతో వారందరికీ ఈ రెండు రోజులు రూ.20 లక్షల విలువ గల సరుకులు ఇవ్వడంతో ఇంత వరకు బిజినెస్ బాగానే ఉందని, ఇక ముందు బ్రాండెడ్‌తో పాటు నాణ్యమైన సరుకులను విక్రయించే ప్రయత్నం చేస్తామని ఏపీఎం శివున్నాయుడు తెలిపారు.

థింసా నృత్యంలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ


థింసాలో ప్రతిభ సాధించిన విద్యార్థులు

సీతంపేట: థింసా నృత్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శ్రీకాకుళం ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో జోన్ వన్ స్థాయి ఇంటర్ స్టేట్, ఇంటర్ యూనివర్సిటీ పోగ్రాంలో జరిగిన పోటీల్లో జానపద నృత్య పోటీల్లో థింసా నృత్యం ప్రదర్శించి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు జరిగిన 37వ సౌత్ జోన్ యువభేరీలో ఐదో బహుమతి పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.శ్యామ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు ఫణికుమారి తదితరులు అభినందించారు.

జోగింపేటలో లేగదూడల ప్రదర్శన


ప్రదర్శనకు వచ్చిన లేగదూడలు

సీతానగరం: పశువైద్య శాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్. రామారావు మండలంలోని జోగింపేటలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ లేగదూడలు వాటి ఆరోగ్య పరిరక్షణ, పోషణ, వ్యాధినిరోధక టీకాలు, ప్రాముఖ్యాన్ని వివరించారు. లేగదూడల ప్రదర్శనకు సచివాల యం పరిధిలో ఉన్న రైతులు 35 లేగదూడలు, 34 పాడి పశువులతో హాజరయ్యారు. లేగదూడల పెంపకంలో మెలకువలపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులకు ఎం.పకీరు నాయుడు, అమరాపు కాశినాయుడు, మర్రాపు సుబ్బినాయుడు ఎంపికైనట్లు డాక్టర్ రామారావు తెలియ జేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సింహాచలం, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ పి.ఈశ్వరనారాయణ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ప్రతినిధి ఎస్.దామోదర్, పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు. లేగదూడల ప్రదర్శన పోటీల్లో విజేతలకు సర్పంచ్ సింహాచలం, డాక్టర్ దీనకుమార్, ఈశ్వరనారాయణ బహుమతులను అందజేశారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం


మృతుడి భార్య రూపకు ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ శ్రీను

భామిని: మండలంలోని పెద్దదిమిలికి చెందిన పాస్టర్ పాలక రామారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యం పొందుతూ ఈ నెల 8న మృతి చెందారు. పాస్టర్ రామారావు మరణ వార్త తెలుసుకున్న క్యాంపులో ఉన్న పాలకొండ ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి తన సంతాపం బుధవారం తెలిపారు. పెద్దదిమిలి సర్పంచ్ తొగరాన శ్రీను ద్వారా ఎమ్మెల్యే కళావతి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి భార్య రూపకు సర్పంచ్ శ్రీను ఈ మొత్తాన్ని అందజేశారు. వలంటీర్లు సృజన, లోకేష్, బూత్ కమిటీ కన్వీనర్ తండాడ మల్లేష్, గృహసారథి రమేష్ పాల్గొన్నారు.

• సంబరంగా పింఛన్ల పంపిణీ


గుమ్మలక్ష్మీపురం: గ్రామ సచివాలయం వద్ద నూతన పింఛన్‌దారులకు నగదును అందజేస్తున్న సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, తదితరులు

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ సంబరంగా జరిగింది. పెంచిన రూ.250లతో కలిపి మొత్తంగా లబ్ధిదారులకు రూ.3వేలు అందజేయడంతో సంబరపడుతున్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. జగన్ బాబు పది కాలాల పాటు చల్లగా ఉండాలని లబ్ధిదారులు ఆశీర్వదిస్తున్నారు.
– సాక్షి నెట్‌వర్క్


భామిని: సొలికిరిలో వృద్ధురాలు సుందరమ్మకు పింఛన్ అందజేస్తున్న గృహసారథి వెంకటమ్మ


గరుగుబిల్లి: గిజబ గ్రామంలో లబ్ధిదారు రామినాయుడుకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ మేరి


పాలకొండ రూరల్: పనుకువలసలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ మంజుభార్గవి, సచివాలయ సిబ్బంది

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సిద్ధం


పెన్షనర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ట్రెజరీ అధికారి శంకరరావు

గుమ్మలక్ష్మీపురం: పెన్షన్‌దారులకు ఎటువంటి సమస్యలున్నా తక్షణ పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని కురుపాం ట్రెజరీ అధికారి శంకరరావు స్పష్టం చేశారు. గుమ్మలక్ష్మీపురం వర్తక సంఘం భవనంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి.హరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన లైఫ్ సర్టిఫికెట్ మంజూరు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పెన్షన్‌దారులను ఉద్దేశించి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన పెన్షన్‌దారులు కురుపాంకు వచ్చి లైఫ్ సర్టిఫికెట్లు చేసుకోవడం కష్టమని భావించి, పెన్షనర్ల కోసం స్వయంగా పెన్షనర్ల వద్దకే వచ్చి లైఫ్ సర్టిఫికెట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బగ్గం బాబ్జీప్రసాద్, తిరుపతిరావు, నాగేశ్వరరావు, చలపతి, మురళి, కృష్ణమూర్తి నాయుడు, చిన్నారావు తదితరులు ఉన్నారు.


పాలకొండ రూరల్: డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వాలీబాల్ ఆడుతున్న ఎంపీడీఓ త్రినాథులు


భామిని: ఏపీ మోడల్ స్కూల్ మైదానంలో పోటాపోటీగా ఆడుతున్న కబడ్డీ పోటీలు


గుమ్మలక్ష్మీపురం : హెచ్ మైదానంలో ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో క్రికెట్ ఆడుతున్న జెడ్పీటీసీ మండంగి రాధిక

ఉత్సాహంగా.. 'ఆడుదాం ఆంధ్రా..'

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడంతో పాటు ప్రజారోగ్య రక్షణలో క్రీడల ప్రాముఖ్యతను తెలియజేసేలా రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు మండల స్థాయిలో బుధవారం ప్రారంభమయ్యాయి. క్రీడల్లో భాగంగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో వంటి పోటీలను నిర్వహిస్తున్నారు. గ్రామ, వార్డు స్థాయిలో కొద్ది రోజుల కిందట నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఇప్పుడు మండల స్థాయిలో పాల్గొన్నాయి. క్రీడాకారులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పోటీలను అధికారికంగా ప్రారంభించారు. క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను వీక్షిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


సీతంపేట: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


వీరఘట్టం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ శ్వేత


జియ్యమ్మవలస: రావాడ రామభద్రపురంలో క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


గరుగుబిల్లి: క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు